# సాగుకు సరిపడా యూరియా సిద్ధం

-డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 1 (ప్రభాతవార్త):** సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపిల కృషి ఫలితంగా సిద్దిపేట జిల్లాకు 2వేల టన్నుల యూరియాను కేంద్రం కేటాయించిందని, ఇందులో భాగంగా గజ్వేల్ రేక్ పాయింట్‌కు వెయ్యి టన్నుల యూరియా చేరిందని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. యూరియా క్కదారి పట్టకుండా వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించి రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా ప్రత్యేక నిఘా కొనసాగిస్తుండగా, రైతుల సహకరించాలని కోరారు. అవసరం ఉన్న మేరకే రైతులు యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఎరువుల సమస్యను దృష్టిలోపెట్టుకొని సిఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తుండిపోవాలి

-గజ్వేల్ ఏసిపి నరసింహులు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 1 (ప్రభాతవార్త):**
పదవీ విరమణ అనేది సహజమని, విధి నిర్వహణలో చేసిన సేవలు ఎప్పుడూ గుర్తుండిపోవాలని గజ్వేల్ ఏసిపి నరసింహులు అన్నారు. గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ యాదగిరిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావులను సోమవారం ఘనంగా సన్మానించి మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఏసిపి నరసింహులు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వహించడం ముఖ్యమన్నారు. ఉద్యోగ విరమణ పొందిన యాదగిరిరెడ్డి, వెంకటేశ్వరరావులు వారి కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని, సమయం దొరికినప్పుడల్లా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వాకింగ్, యోగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు రవికుమార్, ముత్యంరాజు, ట్రాఫిక్ సిఐ మురళి, ఎస్ఐ రఘుపతి, గజ్వేల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లో రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటిస్తున్న కలెక్టర్

రోడ్లు, పంటలపై

## వరద నష్టం అంచనాలు త్వరగా జరపాలి

మెదక్ జిల్లా కలెక్టర్ పరిశీలిన

**టేక్మాల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** కురిసిన భారీ వర్షాలు, వరద ఉధృతికి దెబ్బతిన్న రోడ్లు, పంటలపై వరద నష్టం అంచనాలు వేగంగా జరపాలని సంబంధిత అధికారులను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. సోమవారం టేక్మాల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో పంచాయతీరాజ్ ఈఈ నర్సింలు, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు పడటం వల్ల ప్రకృతి విపత్తుల నేపథ్యంలో భారీ నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని, రోడ్లు కల్వట్లు కాజ్వేలు కోతకు గురై రవాణా స్తంభించిందని యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రవాణాను పునరుద్ధరించే పనిలో ఉన్నామన్నారు. శాశ్వత మరమ్మతులు, పంట నష్టాన్ని అంచనా వేస్తున్నామని నివేదికలు ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. ఇందులో డిపిఓ యాదయ్య, ఎంపిడిఓ రియాజోద్దిన్, తహసీల్దార్ తులసిరాం, పిఆర్ డిప్టి ప్రభాకర్, గ్రామ పంచాయితీ కార్యదర్శిలు పాల్గొన్నారు

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడానికి

## అధిక ప్రాధాన్యతనివ్వాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్‌లతో కలిసి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. జిల్లా అధికార యంత్రాంగంపై విశ్వాసంతో ప్రజావాణి కార్యక్రమం ద్వారా తమ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఎంతో విశ్వాసంతో దరఖాస్తులు అందజేస్తారని ప్రతిశాఖ అధికారి ప్రత్యేకంగా పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో 174 దరఖాస్తులను స్వీకరించినట్లు వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎవో అబ్దుల్ రెహెమన్, డిఆర్వో నాగరాజమ్మ, వివిధశాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయాల్లో ఫ్యాకల్టీలను నియమించండి

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎమ్మెల్సీ వినతి

**రామచంద్రాపురం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో విద్యా ప్రమాణాల మెరుగుకు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలుతీసుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సోమవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఫ్యాకల్టీని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యాప్రమాణాలు దిగుజారుతున్నాయని, పరిశోధన ఉత్పాదకత, విద్యార్థుల అభ్యాస ఫలితాలను రాజీ పడేస్తున్నాయని తెలిపారు. సర్వశిక్ష అభియాన్ ఎస్ఎస్ఎ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి చేశారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందక అవస్థలు పడుతున్నారని గుర్తుచేశారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో తగినంత అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు లేకపోవడం విద్యార్థులు, అధ్యాపకులు అవస్థలు పడుతున్నారని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, అనుబంధ అభివృదిధ చెందుతున్న టెక్నాలజీలలో పెరుగుతున్న డిమార్ సీట్లకు విస్తరణకు సమతుల్య విధానాన్ని కల్గి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చడానికి ప్రభుత్వ వైద్య కళాశాలలను విస్తరించడంలో తెలంగాణ రాష్ట్రం పురోగతిని సాధించిందని, అయినా జనాభా నిష్పత్తికి వైద్యుల కొరతను రోగులు ఎదుర్కొంటున్నారన్నారు. ములుగులోని సమక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి, అధ్యాపకుల నియామాకానికి సహకరించాలన్నారు. మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి, డిజిటల్ అభ్యాస వాతావరణాలను మెరుగుపర్చడానికి, లైబ్రరీ వనరులను అప్‌గ్రేడ్ చేయడానికి, విద్యార్థుల సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు రాష్ట్రంలోని విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ నిధులను సకాలంలో పంపిణి చేయడం అవసరమన్నారు. యుజిఎస్‌కు ఖచ్చితంగా కట్టుబడి ఉండేలా చూసుకోవాలన్నారు. రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సమాజాన్ని ప్రభావితం చేసే సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర మంత్రి హామి చేసినట్లు ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు.



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతి పత్రం అందచేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

# ప్రజలకు 'డెంగ్యూ'పై అవగాహన కల్పించాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్నాయని... జిల్లా ఆరోగ్య, గ్రామ పంచాయతీ, మున్సిపల్ శాఖలతో పాటు ఆయా మండల ప్రత్యేక అధికారులు అప్రమత్తమై ప్రజలు డెంగ్యూ బారిన పడకుండా అవగాహన కల్పించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అదనపుకలెక్టర్లు గరిమాఅగ్రవాల్, అబ్దుల్ హమీద్, జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. డోర్ టూ డోర్ ఫీవర్ సర్వే నిర్వహించి సీరియస్‌గా పని చేయాలన్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు బ్లడ్ యూనిట్ కోసం మెడికల్ క్యాంపు ఇతరత్ర విద్యా సంస్థలలో బ్లడ్ క్యాంపు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ఆర్ఎంపిలపైన కఠినంగా వ్యవహరించి ఫస్ట్ ఎయిడ్ వైద్యంతప్ప అసాధారణ వైద్యం చేయకుండా నోటీస్ జారీ చేయాలని డిఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. చెత్త బండి ద్వారా చెత్త సేకరణ చేయాలని ప్రతి ఇంట్లో నీటి నిల్వలు లేకుండా డ్రైడే సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని వాటర్ ట్యాంక్‌లను 15 రోజులకోసారి శుభ్రం చేయాలని మిషన్ భగీరథ డిఈ, ఏఈలను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే చెరువులు, కుంటలు నిండి ఉన్నాయని రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని చెరువులు, కుంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. గండ్లు పడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ఇసుక సంచులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో జెసిబి, ఇసుక సంచులు అందుబాటలో ఉంచుకొని ఎలాంటి ప్రమాదం ఎదురైన వెంటనే అప్రమత్తం కావాలని ఆదేశించారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని వారం రోజుల్లో విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి



రేవంత్‌రెడ్డితో కలిసి సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న సంజీవరెడ్డి

## ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో సోమవారం ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి సుదర్శన్‌రెడ్డి పరిచయం, గెలుపుపై నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో కలిసిఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్లమెంట్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## నారింజ ప్రాజెక్టును పరిశీలించిన ఇరిగేషన్ ఎస్ఈ

**జహీరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కొత్తూరు గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టును సోమవారం సంగారెడ్డి సర్కిల్ ఇరిగేషన్ పర్యవేక్షక ఇంజనీర్ పోచమల్లు సందర్శించి పరిశీలించారు. పదవీ బాధ్యలు చేపట్టాలక మొదటి మారు పోచమల్లు ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు సామర్థ్యం, సాంకేతిక అంశాలను స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.విజయకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. 3 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రాజెక్టును నిర్మించారని అయితే నీటి నిల్వ కోసమే ప్రాజెక్టును ఉపయోగపడుతున్నట్లు విరవించారు. ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు రేఖ, జనార్ధన్‌రావు, రాజ్యలక్ష్మి, ఏఈఈలు పాండు, జానకిరామ్, సిబ్బంది రఘు, మహబూబ్ అలీ పాల్గొన్నారు.



నారింజ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ పోచమల్లు



సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసిపి నరసింహులు

## సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

-ఎసిపి నరసింహులు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 1 (ప్రభాతవార్త):** గజ్వేల్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని ఏసిపి నరసింహులు సూచించారు. కొడకండ్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన 16 సిసి కెమెరాలను సోమవారం తొగుట సిఐ లతీఫ్, కుకునూర్‌పల్లి ఎస్ఐ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట నేరాలు చేయడానికి వెనుకడుగు వేస్తార తెలిపారు. సిసి కెమెరాల ద్వారా ఎన్నో ముఖ్యమైన కేసులు ఛేధించడం జరిగిందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజల సహకారం ముఖ్యమని తెలిపారు. యువకులు, విద్యార్థులను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని, వారి ప్రవర్తనలో ఏమైనా మార్పు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలాగే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమయ్య, మాజీ ఎంపిటిసిలు అంజయ్య, అశోక్, గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### రేపు వినియోగదారుల అవగాహన సదస్సు

**వర్గల్, సెప్టెంబర్ 1 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గౌరారం గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీ బుధవారం గౌరారం గ్రామ పంచాయతీ వద్ద ఉదయం 10 గంటలకు వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ నర్సింలు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి గ్రామీణ వికాస బ్యాంక్ చైర్మన్, జిల్లా కలెక్టర్, ఆర్‌బిఐ అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్, రెండు తెలుగు రాష్ట్రాల గ్రామీణ బ్యాంకు ఉన్నతాధికారులు హాజరై వివిధ అంశాలపై చైతన్యం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ బ్యాంకులు అందిస్తున్న సేవలు, ఖాతాల వినియోగం, ఆర్థిక అక్షరాస్యత, అమాయకులను ఆసరా చేసుకుని బ్యాంకు లావాదేవీల దుర్వినియోగం, సైబర్‌నేరాలు తదితర అంశాలపై వివరించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమానికి ప్రజలు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



నీరు నిల్వచేసిన డ్రమ్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ అమర్‌సింగ్

## ప్రతి రోజూ డ్రై డే నిర్వహించాలి

-అడిషనల్ డైరెక్టర్ తెలంగాణ డాక్టర్ అమర్‌సింగ్

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 1 (ప్రభాతవార్త):** ఆరోగ్య, గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో ప్రతిరోజూ గ్రామాల్లో డ్రై డేతో పాటు ఇంటింటికి వెళ్లి జ్వర సర్వే నిర్వహించాలని అడిషనల్ డైరెక్టర్ తెలంగాణ డాక్టర్ అమర్‌సింగ్ సూచించారు. సోమవారం తీగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధనరాజ్‌తో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రామాల్లోని పలు కాలనీల్లో తిరుగుతూ నీరు నిల్వ ఉన్న పాత్రలు, పూల తొట్టిలు, కూలర్లు, కొబ్బరి బోండాలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పగిలిన సీసాలు, పాత్రలు, టైర్లు తదితర వాటిని స్వయంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న పాత్రల్లో తోక పురుగులు చేరి అవి దోమలుగా వృద్ధి చెందుతాయని, తద్వారా దోమ కాటు వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయని అన్నారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా ప్రతి రోజూ డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అరుణ్‌కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ మలేరియా, వైద్యాధికారులు డాక్టర్ రాజశేఖర్, ఎపిడమాలజిస్ట్ సోఫాన్, హెచ్ఈఓ చక్రధర్, ఎస్‌యుఓ శ్రీనివాస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

### యువతను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

**కొమురవెల్లి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** కాంగ్రెస్ సర్కారు అర్హులైన యువతకు, నిరుద్యోగులకు స్వయం ఉపాధి రుణాల కోసం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, క్రిస్టియన్, ఎంబిసి ఈడబ్ల్యూఎస్ వర్గాల నుంచి దరఖాస్తున్న చేసుకున్న వారికి రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్రుల మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, మండలం నుంచి 1015 మంది దరఖాస్తులు చేసుకున్నా ఇప్పటీవరకు ఒక్క రూపాయి విడుదలచేయకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ సర్కారు యువతను, నిరుద్యోగులను మోసం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. కాంగ్రెస్ సర్కారు ఇప్పటికైనా కళ్లు తెరిచి నిరుద్యోగులకు, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు చదరపల్లి నర్సింగరావు, గజ్జె వెంకటేష్, నవీన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టులు కట్టడమే పాపమా? నీళ్లు ఇవ్వడమే నేరమా?

-కెసిఆర్‌పై కుట్రలు సాగనివ్వం.. మెదక్ ఎమ్మెల్యే పద్మారెడ్డి, శశిధర్‌రెడ్డి

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
కాంగ్రెస్‌పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టుపై, కెసిఆర్‌పై కుట్రలు చేస్తుందని, ఈకాంగ్రెస్ కుట్రలు సాగనివ్వం అని మెదక్ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. సోమవారం కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్‌పార్టీ తప్పుడు ప్రచారం చేస్తుందని నిరసిస్తూ చిన్నశంకరంపేటలోని అమరవీరుల స్థూపానికి కాళేశ్వరం జలాలతో జలాభిషేకం చేసి, అమరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల సముదాయాల ముందు మెదక్-చేగుంట రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సిఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధంచేశారు. దీంతో మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై ఇరువైపులా వాహనాలుబారులు తీరాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ నారాయణ గౌడ్ అక్కడికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, శశిధర్‌రెడ్డిని అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ రిపోర్టు తప్పుల తడక అని, కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్ర జరుగు తుందన్నారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని ఆరోపణలు చేస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి నదీజలాలను ఆంధ్రాకు తరలించేందుకు సిఎం రేవంత్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.
అపర భగీరథుడు కెసిఆర్ అని, నీళ్లు తెచ్చిన వారిపైనే నిందలు వేస్తు న్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలుచేసినా రాబోయేది కెసిఆర్ ప్రభుత్వమే అని అన్నారు. 14 సంవత్సరాలు చావునోట్లో తల పెట్టి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి కెసిఆర్ తెలంగాణ సాధించారని, సాధించిన తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించారని, రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల చెరువులకు, కుంటలకు మరమ్మతులు చేయించారన్నారు.
రైతు బంధు, ఉచిత కరెంటు అందించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్టు చిత్తుకాగితంలాంటిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్‌లు మల్లిఖార్జున్‌గౌడ్, జితెందర్‌గౌడ్, మాజీ ఎఎంసి చైర్మన్ గంగానరేందర్, బిఆర్ఎస్‌పార్టీ మండలాధ్యక్షుడు రాజు ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మెదక్-చేగుంట రహదారిపై ధర్నాచేస్తున్న పద్మారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు



మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

## నదిలో దూకిన మల్లాగౌడ్ ఆచూకి లభించేనా?

-నాలుగు రోజులైన దొరకని మల్లాగౌడ్

**చౌటకూరు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివంపేట గ్రామానికి చెందిన బడంపేట మల్లాగౌడ్(45) మంజీర నదిలో దూకి నాలుగు రోజులవుతున్నా నేటి వరకు ఆచూకి లభించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఆగస్టు 29న మల్లాగౌడ్ మద్యం మత్తులో మంజీర నదిలో దూకి గల్లంతైన విషయం పాఠకులకు విధితమే. గల్లంతైన మల్లాగౌడ్ కోసం రెండు రోజుల పాటు ఎన్డీఆర్ఎఫ్, రెస్క్యూ టీం డ్రోన్, ఎయిర్ బోట్‌ల ద్వారా గాలించినా ప్రయోజనం లేకపోయింది. ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం ఉధృతంగా వస్తుండటంతో గాలింపు చర్యలను ఆపేశారు. ఉదృతంగా ప్రవహిస్తున్న నదిలో మల్లాగౌడ్ ఆచూకి లభించడం ఆసాధ్యమనే అభిప్రాయాన్ని రెస్క్యూటీం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. నదిలో నీటి ఉదృతి తగ్గాకే మల్లాగౌడ్ ఆచూకి లభిస్తుందని ప్రచారం జరుగుతోంది.

### వాటర్ ఫౌంటెన్‌లో పడి యువకుడి మృతి

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బిజెఆర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి వాటర్ ఫౌంటెన్‌లో పడి ఒక యువకుడు మృతి చెందినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని వెల్కటూర్ గ్రామానికి చెందిన శశిధర్(21) బిజెఆర్ చౌరస్తాలోని వాటర్ ఫౌంటెన్‌లో పడి మృతి చెందినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### పేకాట రాయుళ్ల అరెస్ట్

**జహీరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పట్టణంలోని మస్తాన్ కాలనీలో పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లను పట్టణ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం... మస్తాన్‌కాలనీలో కొందరు జూదం ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి జూదగృహంపై దాడి చేసి జూదగ్రస్తులు తమ కాళ్లకు బుద్దిచెప్పే అవకాశం ఇవ్వకుండా అదుపులోకి తీసుకున్నామన్నారు. జూదరుల నుంచి 15800 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

### బస్సులో మర్చిపోయిన బ్యాగును అందచేసిన ఎస్ఐ

**జహీరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** జహీరాబాద్ నుంచి తొర మామిడి గ్రామానికి వెళుతున్న జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసి బస్సు (టిజి 35 జడ్ 0011)లో కోహీర్ చౌరస్తా వద్ద బసెక్కిన నిర్మల కోహీర్‌లో బ్యాగు మర్చిపోయి దిగిపోయింది. బస్సుల బ్యాగ్ మర్చిపోయినట్లు తెలుసుకున్న నిర్మల కోహీర్ పోలీసు ఠాణాలో వివరించగా స్పందించిన ఎస్ఐ నరేష్ జహీరాబాద్ డిపో మేనేజర్‌కు ఫోన్‌లో సమాచారాన్ని అందించగా డిఎం బస్సు సిబ్బంది అంబరీస్, రాచన్నలను అప్రమత్తం చేయగా బస్సులో మిగిలిపోయిన బ్యాగును గుర్తించి బాధితతురాలికి ఎస్ఐ నరేష్ డిపో సిబ్బందితో కలిసి బాధితురాలికి బ్యాగును (బంగారు ఆభరణాలు, నగదు ఉన్న) అందచేశారు.



బ్యాగును ప్రయాణికురాలికి అందచేస్తున్న ఎస్ఐ, ఆర్టీసి సిబ్బంది

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఒరగబెట్టిందేమీలేదు

### బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ



సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:**
కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటివరకు నిందలు.. నిర్భందాలు తప్ప ఒరగబెట్టిందేమిలేదని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాధకులు కెసిఆర్, హరీష్‌రావు, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రంగధాంపల్లి చౌరస్తా కరీంనగర్- హైదారాబాద్ రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించి సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే అమరవీరుల స్థూపానికి గోదావరి జలాలతో జలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ సర్కారు కాళేశ్వరంపై చేస్తున్న కుట్రలు చూసి అమరుల ఆత్మ గోషిస్తుందన్నారు. కెసిఆర్ ఏం పాపం చేశాడని సిబిఐ విచారణ చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన



కొమురవెల్లిలో ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

**కొమురవెల్లి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :**
కాంగ్రెస్ సర్కారు బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిచూసి ఓర్వలేక తెలంగాణ తొలి సిఎం కెసిఆర్‌పై ఒక నింద మోపాలన్న ఉద్దేశంతో కాళేశ్వంపైన లేనిపోని ఆరోపణలు చేసి సిబిఐ విచారణ చేయాలని కక్ష కట్టాడాన్ని నిరసిస్తూ సోమవారం కొమురవెల్లిలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించకుండా బిఆర్ఎస్‌ను బదనాం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. కాంగ్రెస్ సర్కారు బిఆర్ఎస్‌ను ఎంత బదనాం చేయాలని చూసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్కార్‌కు గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదు



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికి పదవీ విరమణ తప్పదని జనగామ డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం ఈవో అన్నపూర్ణ, జూనియర్ అసిస్టెంట్ మాచర్ల వెంకటచారి పదవీ విరమణ పొందిన సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగంలో ఉన్నంత కాలం చేసిన సేవలు ఎప్పుడు గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో చేర్యాల సిఐ శ్రీను, ఎస్ఐ రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, జైప్రకాష్‌రెడ్డి, అర్చకులు, ఒగ్గు పూజారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బర్దీపూర్‌లో పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలి



ఇండియన్ పోస్టల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**టేక్మాల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బర్దీపూర్‌లో పోస్టాఫీస్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఇండియన్ పోస్టల్ అధికారి మెదక్‌కు టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పెంటయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సంగమేశ్వర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బి.యాదగిరి, జి.కృష్ణయ్య, వాటర్‌షెడ్డు కమిటీసభ్యులు రవికుమార్ పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న రైతుసమాఖ్య నాయకులు

**మునిపల్లి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలంలోని పోల్కంపల్లి గ్రామంలోభారీ వర్షానికి దెబ్బతిన్న పంటపొలాలను తెలంగాణ మంజీరా రైతుసమాఖ్య అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ సోమవారం రైతులతో కలిసి పరిశీలించారు. వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను అధికారులు సర్వేచేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు. నష్టపరిహారం ఒక ఎకరానికి ఇరువైవేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకట్రావు, టి.మల్లన్న, ఎ.శేఖర్, ఎ.చంద్రప్ప, బి.సతీష్, శ్రీహరి, ఎం.శంకర్ పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారులు కాలయాపన వీడాలి...

### -సిపిఎం పార్టీ కార్యదర్శి కె.రవీందర్

**గుమ్మడిదల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
భూభారతిలో దరఖాస్తు చేసుకున్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో అధికారు విఫలమయ్యారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కె.రవీందర్ డిమాండ్‌చేశారు. సోమవారం గుమ్మడిదల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఎన్నడు సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారని కేవలం రెవెన్యూ అధికారులు ఆర్డీవో కార్యాలయంలో భూభారతిలో దరఖాస్తు చేసుకున్న రైతుల రెవెన్యూ సమస్యలు తక్షణమే చర్యలు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ ప్రత్యేకచొరవ తీసుకొని భూభారతిలో రైతు రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామనీ, నేటికి దరఖాస్తులు చేసుకొని మూడునెలలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్కసమస్య అయినా పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. కేవలం తహసీల్దార్ రెవెన్యూ కార్యాలయంలో ఉండడంతో భూభారతిలో దరఖాస్తులు చేసుకున్న రైతుసమస్యలు పరిష్కారం కావని జిల్లా




తహసీల్దార్ కార్యాలయం, సిపిఎం పార్టీ కార్యదర్శి కె.రవీందర్ దృశ్యం

రెవెన్యూ ఉన్నతాధికారులు ప్రత్యేకచొరవ తీసుకొని రైతుల రెవెన్యూ సమస్యల దరఖాస్తులను పరిశీలించి వెంటనే సమస్యలు పరిష్కరించే దిశగా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

## ప్రధాన రహదారిపై గుంతలు ఎమ్మెల్యే సొంతనిధులతో పూడ్చివేత



రోడ్డు మరమ్మతు చేస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
కానుకుంట గుమ్మడిదల ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో ప్రాంత ప్రజలు విన్నపాలను విన్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రహదారినిపై జరుగుతున్న ప్రమాదాలను అరికట్టడానికి సోమవారం తమ సొంతనిధులను వెచ్చించి తాత్కాలికంగా గుంతలుపూడ్చే కార్యక్రమాన్ని మాజీ జడ్పిటిసి కుమార్‌గౌడ్, వారి మిత్రులతో కలిసి ట్రాక్టర్, డోజర్‌లతో రోడ్డును చదును చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కనీసం ఇన్ని రోజులకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని తన సొంత నిధులు వెచ్చించి రోడ్డు పనులను ప్రారంభించినందుకు రహదారి గుండా పయనించే ప్రజలు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అట్లాగే ప్రభుత్వం నిధులతో రోడ్డు పునర్నిర్మాణంపనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

## ఆశావర్కర్ల ముందస్తు అరెస్టు




పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసిన ఆశావర్కర్లు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాలలో పనిచేస్తున్న ఆశా వర్కర్లను చిన్నశంకరంపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చలో హైదరబాద్ ధర్నాకు వెళ్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం అరెస్టు చేయడం అమానుషమని ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు దేవమ్మ అన్నారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. ఆశా వర్కర్లు లలిత, కవిత, వనిత, రేణుకలు ఉన్నారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌దే

### -టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
బిసి రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీదేనని టిపిసిసి ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ అన్నారు. ఈవిషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీశ్రేణులకు సూచించారు. బిసి రిజర్వేషన్లకు హీరోలుగా ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లను నిలబెట్టాలన్నారు. స్థానిక ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రెండు సవరణబిల్లులను శాసనసభ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదించిన నేపథ్యంలో.. సోమవారం అనిల్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న కెసిఆర్.. బిసిలను అణగదొక్కారని ఫైర్ అయ్యారు. సవరణబిల్లులను తెచ్చి బిసిలకు రాజకీయంగా సుస్థిర స్థానం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్‌పార్టీకే దక్కుతుందన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో సిఎం రేవంత్, మంత్రులు చిత్తశుద్ధితో పనిచేశారని పేర్కొన్నారు. ఈవిషయాన్ని కాంగ్రెస్‌నాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిచోట్లా కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. 20నెలల కాంగ్రెస్ పాలనలో చేసిన ప్రజా పాలన, అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాలు, బిసి రిజర్వేషన్లు పెద్ద ఎత్తున కిందిస్థాయి వరకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## చెరువుకట్టను పరిశీలించిన ఆర్‌డిఓ



అల్లాదుర్గంలో పగిలిన చెరువుకట్టను పరిశీలిస్తున్న ఆర్‌డిఓ రమాదేవి

**అల్లాదుర్గం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన అల్లాదుర్గంలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు పగిలిపోయిన బట్టికుంట చెరువుకట్టను సోమవారం మెదక్ ఆర్‌డిఓ రమాదేవి పరిశీలించారు. చెరువుకట్ట తెగిపోవడంతో అటుగా సాగవుతున్న పంటలు నీటిపాలవడంతోపాటు బిటి రోడ్డు తెగిపోయిన విషయం పాఠకులకు విదితమే. చెరువుకట్ట తెగిపోయినట్లు తెలుసుకున్న ఆర్‌డిఓ రమాదేవి సోమవారం తెగిన చెరువుకట్టను పరిశీలించి కట్ట మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. చెరువుకట్ట మరమ్మతులకు ప్రత్యేకచొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బలరాం, నాయకులు బేతయ్య, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వినతి

### -తెలంగాణ జిల్లా రైతు రక్షణసమితి కమిటీ



వ్యవసాయాధికారి దేవికుమార్‌కు వినతి అందజేసిన రైతురక్షణసమితి కమిటీసభ్యులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
జిల్లాలో కురిసిన అకాలవర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ జిల్లా వ్యవసాయ అధికారి దేవికుమార్‌కు జిల్లా రైతు రక్షణసమితి కమిటీ వినతిపత్రం సమర్పించారు. సోమవారం తెలంగాణ రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని వినతి. జిల్లా రైతురక్షణసమితి అధ్యక్షులు పత్రాల యాదగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షులు అక్కమ్మొల్ల మైసయ్య యాదవ్‌ల ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన జిల్లా వ్యవసాయ అధికారి దేవికుమార్‌ను మర్యాదపూర్వకంగాకలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కురిసిన అకాలవర్షాలకు దెబ్బతిన్న పంటలకు మండలాల వారీగా అధికారులతో సర్వే చేయించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈమేరకు మండలాల వారీగా ప్రతి సొసైటీకి రెండు లారీల యూరియాను సరఫరా చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో రైతురక్షణసమితి జిల్లా ఉపాధ్యక్షులు అంతంగారి వెంకటేష్, కార్యదర్శులు నరేందర్, రమేష్‌యాదవ్, శ్రీకాంత్, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

### -ప్లాస్టిక్ నిషేధం, వాడకంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**నర్సాపూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం, వాటి వాడకం వలన కలిగే నష్టాలు, నివారణ చర్యలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోమవారం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి 100రోజుల కార్యక్రమంలోభాగంగా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి ఆదేశాలమేరకు ఘనవ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్‌వాడకం వల్ల కలిగే నష్టాలను, నివారణచర్యలపై ఆపాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు అధికారి ఉదయ్‌కుమార్, జవాన్, అశోక్, మున్సిపల్‌సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారాలు చేయవద్దు

### -వీధివ్యాపారులకు అవగాహన కల్పించిన మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, ఎస్ఐ లింగం



వీధి వ్యాపారస్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, ఎస్ఐ లింగం

**నర్సాపూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
నర్సాపూర్ బస్టాండ్ ఏరియాలో మెయిన్ రోడ్డుపై వీధి వ్యాపారాలు చేయవద్దని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, ఎస్సై బి.లింగం అన్నారు. సోమవారం నర్సాపూర్ బస్టాండ్‌లో వారు పర్యటించి రోడ్డుపైన వ్యాపారాలు చేసుకుంటున్నవారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపైన వీధి వ్యాపారాలు చేసుకున్నట్లయితే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఇటీవల కాలంలో ఎన్నో ప్రమాదాలు జరిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఈమేరకు వీధి వ్యాపారస్థులు రోడ్డుపైన కాకుండా గ్రిల్ లోపల పాదచారులకు ఆటంకం కలగకుండా చిరు దుకాణాలను, పండ్ల బండ్లను పెట్టుకొని వ్యాపారం చేయవచ్చని సూచించారు. ఎవరైనా ఈ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, ఎస్సై బి.లింగంతో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దుకై ధర్నాకు పిఆర్టీయు నాయకులు



ప్లకార్డులతో ధర్నాకు బయలుదేరిన పిఆర్టీయు నాయకులు

**కొల్చారం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**
పిఆర్‌టియు రాష్ట్రశాఖ పిలుపు మేరకు కూల్చారం మండలం నుండి మండల అధ్యక్షులు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్‌లోని ధర్నా కార్యక్రమానికి భారీగా వెళ్లడం జరిగింది. మండల ప్రధాన కార్యదర్శి కర్ణాకర్, మాజీ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, దుర్గయ్య, ఎగొండ, గణేష్, సందీప్, వెంకట నర్సింలు, అరవింద్, దుర్గాప్రసాద్, సిపిఎస్‌ని ప్రభుత్వం వెంటనే రద్దుచేసి ఓపిఎస్‌ని ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది.

## మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులు

**పాపన్నపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
బీహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాతృమూర్తిపై అనుచితమైన, అసభ్యకరమైన పదజలాన్ని ఉపయోగించి విమర్శించినందుకు నిరసనగా మండల కేంద్రమైన పాపన్నపేటలో బిజెపి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. బీహార్‌లో బిజెపి హవా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో జీర్ణించుకోలేక అడ్డగోలువ్యాఖ్యలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నిరసన కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ, నాయకులు రాములు, సంతోష్, నాగభూషణం, సుధాకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెగట్టులో రేషన్ కార్డుల పంపిణీ

**మునిపల్లి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**
మునిపల్లిమండలం గొర్రెగట్టుగ్రామంలో రాష్ట్రమంత్రివర్యులు దామోదర రాజనరసింహ ఆదేశానుసారం సోమవారం నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేయడం జరిగింది. పదేళ్లుగా రేషన్ కార్డులు అందజేయకుండా బిఆర్ఎస్ నాయకులు కాలయాపన చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు అందజేసి పేదలకు న్యాయంచేసిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ అమరేశ్వర్, మాజీ ఎంపిటిసి పాండు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ వీరన్నపాటిల్, గ్రామ పెద్దలు గంగన్న, వీరన్న, టేకూరి వీరన్న, కృష్ణ, మల్లయ్య, శివరాజ్, నవీన్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా నవరాత్రి ఉత్సవాలు

### -వసంత్‌నగర్‌లో ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన

**జహీరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**
గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ఆయా కాలనీల్లో కొలువుదీరిన గణనాథులను ప్రజలు భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు. ఆదివారంరాత్రి పట్టణంలోని వసంత్‌విహార్ కాలనీలో చిన్నారి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయా మండపాలకు ఆయా రాజకీయపార్టీల నాయకులు నిత్యం దర్శించుకుంటున్నారు. వసంత్‌విహార్‌లో వినాయకమండపంవద్ద నిర్వహించిన లడ్డూవేలంలో లడ్డూను రూ.6600కు భక్తులు దక్కించుకున్నారు.

## గంగమ్మ ఒడికి గణపయ్య

**కంగ్టి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
మండలంలోని రాజారామ్ తాండలో శ్రీసేవగణేష్‌మండలి తరపున వేలం పాటను ఆదివారంరాత్రి నిర్వహించారు. తాండవాసులు వేలంపాటలో పాల్గొని ప్రసాదం లడ్డూను జాదవ్ రమేష్ 22,100 రూపాయలకు, అదేవిధంగా చవాన్ కిషన్, రాథోడ్ లక్ష్మన్, బర్దల్ జైషింగ్, రాథోడ్ పర్సురామ్‌లు ఒక్కొక్కరు, ఒక్కొక్క ప్రసాదాన్ని స్వీకరించారు. వీరికి గ్రామ ఆలయపూజారి శ్యామ్‌రావ్ మహారాజ్, గ్రామపెద్దలు మాజీ సర్పంచ్ ఖీరునాయక్, మాజీ ఎంపిటిసి గంగారాం, గోత్తి సదాశింగ్, జైరాంలు, తాండ శ్రీసేవగణేష్ యూత్‌మండలి తరపున ప్రసాదాన్ని అందించారు. తాండలో వినాయకమండపం వద్ద అన్నదానం ఏర్పాటుచేసి అందరికి పంచిపెట్టారు, సోమవారం గిరిజన మహిళలు గణపయ్యను గంగమ్మ ఒడికి చేర్చారు.

## మండల అధికారుల రివ్యూ సమావేశం..

**కంగ్టి, 1 సెప్టెంబర్, ప్రభాతవార్త:**
మండల పరిషత్తు సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్స్ ఫీల్డ్ అసిస్టెంట్స్ మేట్స్, ఎపివో ఈసి ఎంపిఒలతో కింది అంశాలపై రివ్యూ సమావేశము నిర్వహించడం జరిగింది. ఉపాధి హామీలో ప్లాంటేషన్ ఆక్టివిటీస్ పనులజాతరలో చేపట్టిన పనులు పూర్తి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రైమ్ మినిస్టర్ ఆవాస్ యోజన యాప్‌ని అప్డేట్ చేయడం గ్రామపంచాయతీ వార్డుల వారీగా ఓటర్ లిస్టు కన్ఫర్మేషన్ వంటి విషయాలన్నింటిపైన సుదీర్ఘంగా చర్చించి తగిన ఆదేశాలు ఇచ్చి వెంటనే పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. ముఖ్యంగా మొక్కలు నాటడం పని పూర్తి చేయాలి. పేమెంట్ చేయాలి. అలాగే పనుల జాతర కార్యక్రమంలో చేపట్టిన క్యాటిల్ షెడ్ నిర్మాణము, గోట్ షెడ్డు నిర్మాణము, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణం, సోక్ పిట్స్ నిర్మాణం లాంటి పనులు వెంటనే పూర్తిచేయాలని ఆదేశించడం జరిగింది. ఇంకా వర్షాలు కురుస్తున్నందున పంచాయతీ కార్యదర్శులు అందరూ గ్రామాలలో పరిశుద్ధ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు రాకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపిడివో ఎం.సత్తయ్య, ఎంపివో సుభాష్, నర్సింలు తదితరులు ఉన్నారు.

## డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**నర్సాపూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట గ్రామంలోని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌడిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం 1, కౌడిపల్లి డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పిజి సబ్జెక్టులో 50శాతం మార్కులు కలిగి ఉండి ఎస్ఈటి, ఎన్ఈటి, పిహెచ్‌డితోపాటు అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 2,3 తేదీలలో సాయంత్రం 4 గంటలన్నర లోపు కళాశాలలో అందించాలన్నారు. ఈ నెల 4వతేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లతో మెదక్ డిగ్రీ కళాశాలలో డెమోకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం సంగారెడ్డిలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల కు చెందిన నిరుపేద కుటుంబాలకు చెందిన యువకులకు ఉన్నత ఉద్యోగుల సాధన కోసం ప్రారంభించిన టీజీపి ఎస్‌సి గ్రూప్ ఎగ్జామ్‌లు, ఆర్ఆర్‌బి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలు, బ్యాంకింగ్ పరీక్షల శిక్షణ తరగతులను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టీజీపి ఎస్‌సి గ్రూప్స్ పరీక్షలు, ఆర్ఆర్‌బి బ్యాంకింగ్, పరీక్షలకు పోటీపడే పేదల కోసం ఉచితంగా శిక్షణ ఆనందిస్తున్నదన్నారు. నైపుణ్యం గల శిక్షకుల సహాయంతో నాణ్యమైన స్టడీ మెటీరియల్ సైతం అభ్యర్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు అధ్యాపకులు చెప్పే విషయాలపై పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆకారపు జగదీష్ పాల్గొన్నారు.

**ప్రజావాణి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి...**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబరు 1,ప్రభాతవార్త :** ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రజలు సమస్యలను, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, నారాయణ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజారాణిలకు విన్నవిస్తూ ఫిర్యాదులను సమర్పించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కాగా రెవిన్యూ 16 , పౌరసరఫరాలశాఖ 3, డిఆర్‌డిఓ 4, వివిధ శాఖలకు సంబంధించి 21 మొత్తంగా 44 ఫిర్యాదులు అందాయని ప్రజలకు అండగా నిలబడటం ప్రజావాణి ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు
### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** భారీ వర్షాలకు సంబంధించి మెదక్ జిల్లాలో యుద్ధ ప్రాతిపలకన సహాయక చర్యలు కొనసాగుతున్నాయని.. తాత్కాలిక మరమ్మతుల ద్వారా రవాణా పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట మండలం దానంపల్లి వద్ద భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నవాటిని తాత్కాలికంగా మరమ్మతులుచేసి రవాణా పునరుద్ధరించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. జిల్లాలో పంట నష్టం వివరాలు, శాశ్వతంగా చేపట్టే పనులపై నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందించనున్నట్లు ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ నరసింహులు, మండల ప్రత్యేక అధికారి సివిల్ సప్లై డిఎం జగదీష్, తాసిల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో షాకిర్ అలీ, ఆర్ఐ రమేష్.. మండల కాంగ్రెస్ నాయకులు రాయిని మధు, నారాగౌడ్, రాజేందర్‌గౌడ్, దాచ సంగమేశ్వర్.. పెరుమాండ్లుగౌడ్ పాల్గొన్నారు.

**రాయారావు విశ్వేశ్వరరావుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు**

**రామాయంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** మండలంలోని రాయిలాపురం గ్రామానికి చెందిన పాటల రచయిత, స్వరకర్త, గాయకుడు రాయారావు విశ్వేశ్వరరావుకు అరుదైన గౌరవం దక్కింది. 2019 నుండి 2025 వరకు ప్రతి సంవత్సరం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్నేహం గురించి పాటలు రాయడం, కంపోజ్ చేయడం ద్వారా అద్భుతమైన ఘనతను విశ్వేశ్వరరావు సాధించారు. ఇంటర్‌నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ సంస్థ వారు అతని ప్రతిభను గుర్తించి ధ్రువీకరణ పత్రం అందించారు. స్నేహితుల రోజున ప్రతిఏటా స్వీయ రచనతో పాటు స్వరకల్పన చేసి ప్రతి పాటను తగిన వీడియో చేసి rayarao vishu యూ ట్యూబ్ ఛానెల్ లో రిలీజ్ చేసిన ఏకైక వ్యక్తిగా ఈ రికార్డ్ ను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు చేశారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర్‌నారాయణ ఆర్.వేణుగోపాలరావు తదితరులు ఉన్నారు.

### ఆశవర్కర్ల ముందస్తు అరెస్టులు

**నిజాంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** మండలకేంద్రంలో సోమవారం పోలీసులు ఆశవర్కర్లను ముందు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు చాలీచాలని జీతాలతో జీవనం గడుపుతున్నామని జీతాలను పెంచాలనే విషయంలో చలో కమిషనరేట్ ముట్టడికి బయలుదేరుతున్న తరుణంలో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించడం దారుణంఅన్నారు.ఈ కార్యక్రమంలోఆశ వర్కర్లు బండారి లక్ష్మి, కొమ్మట బాలమణి, ఉన్నారు.

### కృత్రిమ ఇసుకను తరలిస్తున్న లారీ పట్టివేత

హత్నూర సెప్టెంబరు 1,ప్రభాతవార్త : హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామ శివార్లలో అక్రమంగా తయారు చేస్తున్న కృత్రిమ ఇసుక రవాణాను గుర్తించి, ఇసుకను లోడ్ చేసి తరలించడానికి సిద్ధంగా ఉంచిన ఒక లారీని అదుపులోకి తీసుకున్నట్లు హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి సోమవారం తెలిపారు. సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి చూడగా అక్రమ కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నట్టు గుర్తించామని, ఎవరు చేస్తున్నారనే విషయాన్ని విచారణలో తేలుస్తామని ఆయన అన్నారు. అనంతరం శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

### ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబరు 1,ప్రభాతవార్త :** పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీజీఈ జేఏసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డిలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు ఉద్యోగ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు, ఉద్యోగులు మహిళ ఉద్యోగ సంఘాల నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకొని డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నినాదాలు ఇచ్చారు. భద్రతలేని పెన్షన్ మాకెందుకు, ఆర్థిక భద్రతతో కూడిన పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. పెన్షన్ భిక్ష కాదని తమ హక్కు అని వారు నినదించారు. సిపిఎస్ అంతం టీజీఈ జేఏసీ పంతం అంటూ నినాదాలు ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు కార్యక్రమంలో టీజీఇ జెఏసి చైర్మన్ ఎండి జావీద్ అలీ, సెక్రెటరీ జనరల్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆయా శాఖలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## వంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం
### ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

**పాపన్నపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన వర్షాల వల్ల వంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని గాంధారిపల్లిలో నీట మునిగిన వంటలను పరిశీలించారు.ఈ సంధర్భంగా మాట్లాడుతు మండలంలో సుమారు 40 శాతం వంటల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయిని చెప్పారు. అధికారుల సర్వే అనంతరం నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం సహాయం చేస్తుందన్నారు. కొంపల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకు ముందు ఆయన నాగ్సాన్పల్లి గ్రామంలో నర్సింలుగౌడ్, భరత్ల కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప ,ప్రశాంత్రెడ్డి, నరెందర్గౌడ్, హఫీజ్ మొలాసాబ్, ప్రవీణ్, ఖలీం తదితరులు ఉన్నారు

### పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 40 వేలు ఇవ్వాలి

**పాపన్నపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన భారీ వర్షాల మూలంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 40,వేల చొప్పున ఆర్థిక సాయం చేయాలని బిజెపి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బిజెపి నాయకులతో కలిసి మండల పరిధిలోని ఎల్లాపూర్, గాంధారి పల్లి కొత్తపల్లి ఆరేపల్లి ముద్దాపూర్, రామతీర్థ మల్లంపేట, కొత్త లింగయ్య పల్లి, చికోడ్, కొంపల్లి నార్సింగి, బాచారం, కొడపాక గ్రామాలలో పర్యటించి పంటల పరిస్థితి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నామమాత్రంగా చేసి చేతులు దులుపుతున్నారని విమర్శించారు. వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించకుంటే రైతులతో తాసిల్ కార్యాలయం ముట్టడిస్తామని పేర్కొన్నారు. జిల్లా నాయకులు బికొండ రాములు , శంకరన్న , శ్రీరామ్ నరేష్, మెట్టు దుర్గాప్రసాద్, నాగేష్ దుర్గేష్ మల్లేష్ ప్రభు యేసు తోపాటు రైతులు రైతులు ఉన్నారు.

# యూరియా కోసం రైతుల ఆందోళన చెందవద్దు

**-యూరియాకి ప్రత్యామ్నాయంగా నానో యూరియా**
**-మండల వ్యవసాయ అధికారి శ్రీలత యూరియా వాడాలి**

**మంచాల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :**
మంచాల మండలంలోని రైతులు యూరియా కోసం ఎలాంటి ఆందో ళన చెందవద్దని ఒకటి రెండు రోజుల్లో వ్యవధిలో యూరియా అందు బాటులో రానున్నాయని తెలిపారు. యూరియా కు ప్రత్యామ్నా యంగా లిక్విడ్ రూపంలో ఉండే నానో యూరియా వాడాలని కోరారు. నానో యూరియా లో యూరియా కు సమానమైన నత్రజని వుంటుంది. నానో యూరియా వాడకంలో సాగు ఖర్చు తగ్గించవచ్చు. దీని ధర బాటిల్ కి 225/ వుంటుంది. బాటిల్ అర లీటర్ 500 మీ. లీ . ఎకరానికి సరిపోతుందని వివరించారు. అర లీటరు నానో యూ రియా.. బస్తా యూరియాతో సమానం పంటల దిగుబడిలో 8 శాతం అధికంగా వచ్చే అవకాశం ఉంది. లిక్విడ్ రూపంలో ఉండే నానో యూరియాలోనూ యూరియాతో సమానమైన నత్రజని ఉంటుందని మంచాల మండల వ్యవసాయ అధికారి ఏ .శ్రీలత తెలిపారు.పైగా దీని రవాణా, నిల్వ, వినియోగం కూడా సులభంగా ఉండడమే కాకుం డా రైతులకు ఆర్థిక భారాన్ని కూడా తగ్గిస్తుందని అన్నారు.లీటరు నీటిలో 4 ఎంఎల్ నానో యూరియాను కలిపి స్ప్రే చేయాలని రైతులకు వివరించారు.డ్రోన్ ద్వారా వినియోగిస్తే 10 లీటర్ల సామర్థం ఉంటే 250 ఎంఎల్, 20 లీటర్ల సామర్థం ఉంటే 500 ఎంఎల్ సరిపోతుందని అన్నారు.పంట వేసిన తర్వాత పిలకలు వచ్చే దశ నుంచి నానో యూరియా స్ప్రే చేయాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. నానో యూరియా వాడడం వల్ల సాధారణ యూరి యాతో పోలిస్తే 8 శాతం ఎక్కువ దిగుబడి వచ్చినట్టు తేలింది. ఇక నానో యూరియా వాడడం ద్వారా యూరియా వినియోగాన్ని 25 నుంచి 40 శాతం తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. కాలు ష్యాన్ని తగ్గించి.. దిగుబడిని పెంచుతుంది.45 కిలోల యూరియా బస్తాకు 500 ఎంఎల్ నానో యూరియా సమానం. పంటల మీద యూరియా చల్లితే సగం నత్రజని మాత్రమే మొక్కలకు చేరుతుంది. మిగిలిన యూరియా నేల, నీటిలో కలిసి కాలుష్యాన్ని పెంచుతుంది. అదే నానో యూరియాను స్ప్రే చేయడం ద్వారా నత్రజని నేరుగా మొక్కలకు చేరుతుంది. ఇది కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా 8 శాతం వరకు దిగుబడి పెంచుతుందని అధ్యయనాలు చెప్తున్నాయి. అన్ని రకాల పంటలకు నానో యూరియా వాడుకోవచ్చును. మంచి దిగుబడి వస్తుంది నానో యూరియా వాడకంతో వరి, మొక్కజొన్న, ప్రత్తి, జొన్న , కంది, పండ్ల, కూరగాయల పంటల్లో మంచి దిగుబడి వస్తుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం పొందుతున్నారు నానో యూరియాను మొక్కలు బాగా గ్రహించడంతో ఫలితాలు వెం టనే కనిపిస్తున్నాయి.కావున అందరూ రైతులు లిక్విడ్ నానో యూరియా, నానో డి ఏ పి లను వాడాలని అన్నారు.

# క్రిస్టియన్ కమ్యూనిటీ శ్మశానవాటికను తక్షణమే ఆపాలి

### -అడిషనల్ కలెక్టక్‌కు ఫిర్యాదు

**కొత్తూరు సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**
తక్షణమే క్రిస్టియన్ కమ్యూనిటీ స్మశానవాటిక నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన గ్రామ ప్రజలు కొత్తూరు మండల పరిధిలోని కోడిచర్ల తండాలోని సర్వే నెంబర్ 198లో ప్రభుత్వ భూమి సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని క్రిస్టియన్ కమ్యూనిటీ స్మశాన వాటికను ఏర్పాటు చెయ్యడా నికి కొత్తూరు రెవెన్యూ అధికారులు రెండు మూడు సంవత్సరాల నుంచి ప్రయత్నిస్తున్నారు. ఇట్టి వ్యవహారంపై సోమవారం రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్కు మాజీ ఎంపిటీసీ రవీందర్ రెడ్డి గ్రామ స్థులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో క్రిస్టియన్ కమ్యూనిటీ స్మశాన వాటికను నిర్మించే వ్యవహారం స్థానిక ప్రజలకు తెలియడంతో క్రిస్టియన్ కమ్యూనిటీకి చెందిన స్మశాన వాటిక ను గ్రామ ప్రజలకు తెలియకుండా ఎలా ఏర్పాటు చేస్తారని స్థానిక అధికారులను మీద ఆగ్రహించడం జరిగింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీకి భవనం లేదు, భవనం కట్టుకోవడానికి ప్రస్తుతం ఉన్నది ఈ ప్రభుత్వ భూమి ఈ భూమిని క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ కు కేటాయిస్తే మా గ్రామ పంచాయతీకి అభివృద్ధి చేసుకోవడానికి లేదా భవనం కట్టుకోవడానికి మాకు భూమి ఉండదు కనుక ఈ విషయం లో మాకు సహకరించి తక్షణమే ఈ నిర్ణయాన్ని నిలిపివేయాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని క్రిస్టియన్ కమ్యూనిటీకి సంబంధించిన స్మశాన వాటికను నిలిపి వేయాలని కోరుతూ స్మశాన వాటిక విషయం గ్రామ ప్రజల అనుమతి లేకుండా బలవంతంగా ఒక మతానికి సంబంధించిన స్మశాన వాటికను అధికారులు బలవంతంగా ఏర్పాటు ప్రయత్నిస్తున్నారని ఈరోజు రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ గారికి ఈ విషయాన్ని తెలపడం జరిగింది అయితే ఈ విష యంపై రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి గారు మీకు మీ గ్రామానికి న్యాయం అయ్యేటట్టు చూస్తానని సనుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తండా కోడిచెర్ల మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి గారు, మరియు కోడిచెర్ల తండా మాజీ సర్పంచ్ సంతోష్ నాయక్ గారు మాజీ వర్డ్ సభ్యులు బిచ్య నాయక్, వెంకటయ్య, దేవేందర్, శంకర్ నాయక్, రెడ్యానాయక్, పందు నాయక్ గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


అడిషనల్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

# కొత్త రేషన్ కార్డుదారులకు నేటి నుంచి సన్న బియ్యం పంపిణీ

### - కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**మంచాల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో సోమవారం నూతన రేషన్‌కార్డు సభ్యులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. గత పదేళ్ల కాలంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని తెలం గాణలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాతనే నిరుపేదలకు రేషన్ కార్డుల కల సాకారం అయిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనా యకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డు పొందిన లబ్దిదారులకు సోమవారం నుండి సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సందర్భంగా ఆరుట్ల లోని రేషన్ షాపుల వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదని నిరుపేదలు రేషన్ కార్డులు లేక చాలా ఇబ్బందులు పడ్డారని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు మంజూరు చేసిందని నేటి నుండి వారికి బియ్యం పంపిణీ కూడా చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్ర మంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ ప్రధానకార్యదర్శి, దాసరమోని రమేష్ ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ మార లక్ష్మణ్ ,కంబాలపల్లి బుగ్గరాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య ,మార సురేష్, అంతటి రాజు గౌడ్ ,ప్రజాసంఘాల నాయకులు కంబాలపల్లి భాస్కర్, దంటు మధుసూదన్ రెడ్డి, తలారి కృష్ణ ,పొలమోని అనిల్ రాజు, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు దాసరమోని అశోక్,తవిటి యాదగిరి, మద్దెల గోపాల్, దాసరమోని మారయ్య, రాఘవేందర్, ఎండి రఫీక్, దండ వెంకటేష్,మద్దెల గోపాల్, ఎండి జావీద్, నూకం శివ పాల్గొన్నారు.


రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం అందజేస్తున్న దృశ్యం


ధారూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట యూరియా కోసం బారులు తీరిన రైతులు

## యూరియా కోసం బారులు తీరిన రైతులు

**ధారూరు, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:**
ధారూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యక్రమం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. గత కొన్ని రోజులుగా యూరియా కొరత ఉండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. తిండి తిప్పలు లేకుండా క్యూలైన్లో రోజు మొత్తం నిలబడ్డ యూరియా దొరకని పరిస్థితి ఏర్పడింది. పొలాలు నాట్లు వేసి నెల రోజులు గడుస్తున్న యూరియా చల్లలేకపోతున్నామని రైతులు అంటున్నారు. ఒక్కొక్కరికి రెండు బస్తాలు చొప్పున ఇచ్చేందుకే అతి కష్టంగా మారిం ది అని చెప్పుకొస్తున్నారు. సన్న పెద్ద కారు రైతులకు యూరియా కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాగైతే వ్యవసాయం చేయడం చాలా కష్టంగా మారుతుంది అంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్దకు చేరుకుని రైతులకు నచ్చజెప్పి వరుస క్రమంలో నిలబెట్టారు. వరుస క్రమంలో వచ్చిన రైతులకు అధికారులు టోకె న్లు జారీ చేశారు. పిఎసిఎస్ వ్యవసాయ అధికారులు ఇచ్చిన టోకె న్లు ఆధారంగా ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా ను సహకార సంఘం సిబ్బంది, సిబ్బంది పంపిణీ చేశారు.

### ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత

**కేశంపేట సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**
నేటి విద్యార్థులే రేపటి భావితరాలకు ప్రధాతలని సంతాపూర్ గ్రామ బి ఆర్ ఎస్ యువ నాయకుడు సాజీద్ అన్నారు. కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో సోమవారం 35 వేల విలువ చేసే వాటర్ ఫిల్టర్ ను తన సొంత డబ్బులతో గ్రామంలోని ప్రాథమికో న్నత పాఠశాలకు బహుకరించారు. ఉదార స్వభావంతో పాఠశాల కు వాటర్ ఫిల్టర్ ను అందించిన సాజీద్ ను గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అరుణ్, శ్వేత, శివ లీల, మ్రాజీ సర్పంచ్ వరలక్ష్మి ప్రభాకర్ రెడ్డి, గ్రామస్తులు రామస్వామి, అశోక్, సోమరాజు, సురేష్, జగ్గయ్య, పాల్గొన్నారు.

### పూడూరు తహసీల్దారుగా విజయ్‌కుమార్ బాధ్యతలు

**పూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :**
నూతన తహసీల్దారుగా విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేకు కొడంగల్‌లో పనిచేస్తున్న విజయ్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన భరత్‌కుమార్‌గౌడ్ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు.ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండల ప్రజల సహకారంతో భూసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

## కార్మికులకు దుప్పట్లు పంపిణీ


గౌడవెల్లిలోని సాకేత్ ప్రణామంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

**మేడ్చల్, సెప్టెంబర్ 1. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గౌడవెల్లిలోగల సాకేత్ ప్రణామంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి సొసైటీనాయకులు సోలాపూర్ దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు. గత గురుపూర్ణిమ రోజున ప్రణామం నివాసి నర్మద భగవాన్ సాయిబాబా పేరుతో భిక్ష స్వీకరించగా తొమ్మిది వేల ఒక వంద రూపాయలురాగా, ఆ డబ్బుతో 41 సోలాపూర్ దుప్పట్లు కొనుగో లు చేసినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. అందులో 13 సెక్యూ రిటీ గార్డులకు, 24 పారిశుధ్య కార్మికులకు, మిగతావి ఇతర సిబ్బందికి పంపిణీ చేశామని పేర్కొన్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షురాలు రత్నం, డైరెక్టర్లు నిరం జనరావు, సజ్జా బాబు, పాల్గొన్నారు.

### వినాయక మండపాలకు బియ్యం బస్తాల పంపిణీ

**కేశంపేట సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**
గణనాథుడి చల్లని చూపులు ప్రజల అందరిపై ఉండా లని పాడి పంట లు సమృద్ధి గా పండి ప్రజలంతా సుఖ సంతోషాల తో ఉండేలా చూడాలని ఆ గణనాథుని వేడుకున్నట్లు బిజెపి సీని యర్ యువ నాయకుడు పాలాది శ్రీనివాస్ తెలిపారు . కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రా మంలో వినాయక చవితి సంద ర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన 15 వినాయక మండపాలకు మండపానికి 50 కిలోల చొప్పున 15 మండపాలకు అన్న విస్తరణ కార్యక్రమానికి బియ్యం బస్తాలను అందించినట్లు శ్రీనివాస్ తెలిపారు. గొప్ప మనసుతో ఆ గణనాథు డిపై ఉన్న భక్తితో గ్రా మంలో ఉన్న అన్ని మండపాలకు బియ్యం బస్తాలను అందించిన పాలాది శ్రీనివాసులును మండపాల నిర్వహ కులు గ్రామస్తులు అభినందించారు.

## ఐదు లక్షల ఎల్ఓసి చెక్కు అందజేత

**మర్పల్లి సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**
మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన గడిల నాగభూషణం సుమిత్ర కుతురు సుమిత్ర అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా ఈవిషయం తెలుసుకున్న నాయకులు గొల్ల రాములు యాదవ్ రఘుపతిరెడ్డి, మండల పార్టీ అద్యక్షులు సురేష్‌యాదవ్‌లు స్పీకర్ గడం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకుపోయామని తెలిపారు.స్పందించిన స్పీకర్ సుమిత్ర ఆరోగ్యఖర్చులకు గాను సోమవారం వారి కుటుంబానికి 5లక్షల రూపాయల ఎల్ ఓ సిని అందించినట్లు వారు తెలిపారు.

### రామాయంపేటలో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో జరగబోయే వినాయక నిమజ్జనానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని నేషనల్ హైవే పక్కన ఉన్న సర్వే కుంట ను ఈ సందర్భంగా పరిశీలించారు. తహసీల్దార్ రజనీకుమారి, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరాజాగౌడ్, ఎస్సై బాలరాజు, మున్సిపల్ మేనేజర్ రఘువరన్, కరెంటు ఏఈ తిరుపతి రెడ్డి తదితర అధికారులు కలిసి చెరువు వద్ద ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు. నిమజ్జనం జరిగే ప్రదేశంలో గ్రావెల్ వేసి మట్టితోటి నింపి పరిశుభ్రంగా తయారు చేయడంతో పాటు బుష్ కటింగ్ ద్వారా పొదలను తొలగించారు. అలాగే భక్తుల ఆరోగ్య రక్షణ కోసం బ్లీచింగ్ పౌడర్ ప్రదేశం అంతటా చల్లారు. నిమజ్జనం రోజున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టెంట్లు, విద్యుత్ అలంకరణ, త్రాగునీటి వసతి, హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

### వరద బాధితులకు ఆహార కిట్లు పంపిణీ

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** పట్టణంలో వరదల బీభత్సం కారణంగా నష్టపోయిన వారికి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆహార కిట్లు అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలో చాలామంది ఇల్లలోకి వరద ప్రవాహం రావడం వల్ల చాలా నష్టం కలిగింది. దానికి సహాయంగా విశ్వహిందూ పరిషత్ 50 కుటుంబాలను గుర్తించి పూరి గుడిసెలు ఉన్నటువంటి నిరుపేదలకు టార్పాలిన్ కవర్లు అందించడం జరిగింది. అదేవిధంగా 50 కుటుంబాలకు ఆహార కిట్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అఖిల భారతీయ అధికారి రామరాజు, రాష్ట్ర సహకార దర్శి రమేష్‌ల చేతుల మీదుగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పబ్బ సత్యనారాయణ, విభాగ్ సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం, జిల్లా కోశాధికారి ఎర్రం ముత్యాలు, జిల్లా మాతృ శక్తి సంయోజిక అనంత లక్ష్మి, చంద్రకళ, ప్రఖండ అధ్యక్షులు తాటిపల్లి శ్రీనివాస్, గబ్బుల వెంకటేష్, మాణిక్, రేవంత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరపాలి : ఎస్ఐ

**పాపన్నపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు జరపాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం చెరువులు,కంటలు నిండుగా ఉన్నందున నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చిన్నపిల్లలను చెరువులు, కుంటలు వద్దకు తీసుకువెళ్లవద్దన్నారు.నిమజ్జనం చేసే సమయంలో చెరువులు, కుంటల్లో లోతుగా ఉన్న ప్రదేశాలకు వెళ్లవద్దన్నారు.కండీషన్ లో ఉన్న వాహనాలను మాత్రమే నిమర్జనాలకు వినియోగించాలన్నారు.అనుభవజ్ఞులైన, లైసెన్స్ పొందిన డ్రైవర్లతో వాహనం నడిపించాలని సూచించారు.డీజే సౌండ్లకు అనుమతి లేదన్నారు. నిబంధనలు పాటిస్తూ చీకటి పడేలోపు ప్రశాంతంగా గణేష్ శోభాయాత్ర, నిమర్జనం నిర్వహించాలన్నారు.

### యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
**మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి**

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరాచేయడంలో విఫలమైందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం పెద్దశంకరంపేటలో పిఎసిఎస్ గోదాం వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరి ఉండడంతో అదే సమయంలో అక్కడికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. ఉదయం నుండి రైతులు బారులు తీరి ఉండటం పై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వ్యవసాయ అధికారులు, సొసైటీ బాధ్యులతో మాట్లాడి రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా అందించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి పాలనలో రైతులు ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు.. గత బి.ఆర్.ఎస్ హయాంలో ఒక్కరోజు కూడా యూరియా ఇబ్బంది లేకుండా ప్రభుత్వం రైతులందరికీ యూరియాను సరఫరా చేసిందని గుర్తు చేశారు.. గత కొన్ని రోజులుగా రైతులకు యూరియా దొరకకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు.. ప్రభుత్వం వెంటనే రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్. నాయకులు రమేష్ , సురేష్ గౌడ్.. మాణిక్ రెడ్డి, దత్తు సుభాష్, శంకర్ గౌడ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు..

### వరద ప్రవాహం వైపు వెళ్లొద్దు : ఆర్‌డివో

**పాపన్నపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు.సోమవారం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద వరద ప్రవాహాన్ని, పరిస్థితిని పరిశీలించారు.నీటి ప్రవాహం వైపు ఎవరు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ఆలయానికి వచ్చే భక్తులు అధికారుల సూచనలు పాటించాలన్నారు.ఆలయ, పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు.అనంతరం రాజగోపురంలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఆర్ఐ నాగరాజు, ఆలయ అర్చకులు, సిబ్బంది, తదితరులున్నారు.

### విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

**గుమ్మడిదల సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తులను సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, సొంత నిధులను కేటాయించి స్వయంగా పంపిణీ చేశారు. విద్యార్థులు క్రీడా రంగంలో ప్రతిభ కనబరచాలని, ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించ గల సామర్థం కలిగి ఉన్నారని పేర్కొంటూ, వారికి కావలసిన సదుపాయాలను అందించేందుకు సిజిఆర్ ట్రస్ట్ ముందుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాంబాబు, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, తుపాకుల రాజు, ఏ. కృష్ణ,గోపాల్, చక్రపాణి, వెంకట్‌రెడ్డి, గణేష్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, సత్యనారాయణ, చంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, రాజు, మహేష్, చంద్రశేఖర్, దాసు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### గణనాథునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**నర్సాపూర్ సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** వినాయక నవరాత్రి ఉత్సవాలో భాగంగా సోమవారం నర్సాపూర్ మున్సిపాలిటీ ఎన్జీవోస్ కాలనీలో సాయి బాబా ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథునికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గాప్ప గారి అశోక్ గౌడ్ కాలనీవాసులు పిల్లి ఆనంద్ కళ్యాణి, నాయకులు పంబల్ల బిక్షపతి, నయీముద్దీన్, సుధాకర్ రెడ్డి, సత్యం గౌడ్, షేక్ హుస్సేన్, రింగుల ప్రసాద్ సూరారం నరసింహులు, బాల్‌రెడ్డి, డీలర్లు వంజరి సుధాకర్, చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**కొల్చారం, సెప్టెంబరు 1(ప్రభాతవార్త):** మండల పరిధిలోని చిన్న ఘనపూర్ గ్రామంలో సోమవారం సిఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారుడికి సిడిసి మాజీ చైర్మన్ సూరెగారి నరేందర్‌రెడ్డి, బాగారెడ్డి, విట్టల్‌రెడ్డి, నవీన్, మల్లేష్ గ్రామానికి చెందిన మైసగల్ల రమేష్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ. 10 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు రమేష్ మాట్లాడుతూ చెక్కును మంజూరు చేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

### టార్పాలిన్‌లు అందజేత

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధి ఖాజాపూర్ తండాలో పూరిళ్ల తడిసిపోయి గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. సానిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇక్షణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మేఘన నందూరి, రాజశేఖర్‌రెడ్డి సహకారంతో ఖాజాపూర్ తండా, సంకాపూర్ తండాలో వర్షం వల్ల ఇబ్బందులు పడిన 20 కుటుంబాలకు టార్పాలిన్‌లు, దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సానిక్ష ఫౌండేషన్ అధ్యక్షులు శివ, మోతిలాల్, గ్రామస్తులు బాబు, కుమార్, గోవింద్, సీనా తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు పనులు పూర్తి చేయండి

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబర్ , 1,ప్రభాతవార్త:**
మండలంలోని చౌదరిగూడ గ్రామం నుంచి జిల్లెడులో వెళ్లే రోడ్డు పనులు పూర్తిచేయాలని మాజి సర్పంచ్ బాబురావు కోరారు. రోడ్డు నిర్మాణం చేసే సమయంలో 60 మీటర్ల వరకు రోడ్డు నిర్మాణం చేయలేదని ఆయన అన్నారు. దీంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగ మారిందని ఆయన పెర్కొన్నారు. రోడ్డు గుంతల మయంగ మారడం వల్లన వాహనదారు, ప్రజలు ప్రమా దాల బారిన పడుతున్నారని తెలిపారు.

## పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

**-చెరుకు రైతులకు సూచనలు చేసిన శాస్త్రవేత విజయ్‌కుమార్**

**న్యాల్‌కల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, ఈదురు గాలలకు దెబ్బతిన్న పంటలను సోమవారం మండల పరిధిలోని బసంత్‌పూర్ గ్రామంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్, విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ, ఎఈలో సాయిలు రైతులతో కలిసి పరిశీలించారు. గ్రామానికిచెందినరైతులు సాగుచేసుకుంటున్న సోయ, పత్తి, చెరుకుపంటలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు పలుసూచనలు చేశారు. వ్యవసాయపొలంలో నిలిచిపోయిన నీటిని కాలువలు తీసి బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంటలకు సోకిన తెగులునివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల, వినియోగించాల్సిన మందుల వివరాలను వివరించారు.

## ఎల్ఐసిలో బీమా వారోత్సవాలు

**-దీప ప్రజ్వలన, కేక్ కట్ చేసిన మేనేజర్**



బీమావారోత్సవాలను ప్రారంభిస్తున్న బ్రాంచిమేనేజర్ శ్రీనివాసరాజు

**జహీరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

కుటుంబభద్రత కొరకు ప్రతి ఒక్కరు జీవితబీమా పాలసీని విధిగా తీసుకోవాల్సిన అవసరం ఉందని జహీరాబాద్ జీవితబీమా సంస్థ కార్యాలయ బ్రాంచిమేనేజర్ శ్రీనివాసరాజు, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్‌రావులు అన్నారు. సోమవారం జీవితబీమా సంస్థ 69వ వార్షికోత్సవ ఉత్సవాలను పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో బ్రాంచి అధికారులు, డెవలప్‌మెంట్ అధికారులు, ఎల్ఐసి ఏజెంట్లు, జీవితబీమా పాలసీదారులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. దీప ప్రజ్వలనచేసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎల్ఐసి కేక్‌ను కట్‌చేసి వారోత్సవాలకు అంకురార్పణచేశారు. ఈ సందర్భంగా మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌లు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 2న ఏజెంట్లకు క్విజ్ పోటీలు, 3న స్టాఫ్ దినోత్సవం, 4న గురుదివస్, 5న ఏజెంట్లదినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి కుటుంబానికి ఏజెంట్ల భద్రత కల్పించేందుకు పాలీసులు అందిస్తూ అందరి అభిమానాన్ని అందుకుంటున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బ్రాంచిమేనేజర్ శ్రీనివాసరాజు, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్ రావు, డెవలప్‌మెంట్ అధికారులు రావి నరేంద్రరెడ్డి, రాజు, నిఖిల్, అక్షయ్, బ్రాంచి అధికారులు రఘురామ్‌శాస్త్రి, జమున, నరసింహ, విజయభాస్కర్, అశోక్, శ్రీనివాస్, ఆశా, భాస్కర్, మాణయ్య, సాయిహరి, అలీమ్, లియాఫీ అధ్యక్షులు, నాయకులు, ఏజెంట్లు ఈ.విఠల్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, రేకుళ్గి సుభాష్, చంద్రారెడ్డి, నాగన్న, అశోక్‌రెడ్డి, లక్ష్మయ్య, అంజయ్య, మచ్చేందర్, మల్లికార్జునచారి, నర్సింలు, గార్లపల్లి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి భారీ వర్షం



వ్యవసాయ పొలాల్లో పడిపోయిన విద్యుత్తు స్తంభం

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

ఆదివారం అర్ధరాత్రి నుండి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. పంటపొలాలు చెరువులను తలపించాయి. కొన్నిపొలాల్లో ఇసుక మేటలువేశాయి. మదూర్ శివారులో వ్యవసాయపొలాలకు సరఫరా అయ్యే విద్యుత్తు స్తంభం నేలవాలింది. రైతులు ఈ విషయం గమనించి విద్యుత్తు అధికారులకు సమాచారం అందించారు. గజగట్లపల్లిలో వ్యవసాయపొలం నుండి ఎక్కువైననీరు బయటకు పోవడానికి ఏర్పాటుచేసుకున్న పైపులు భారీవర్షానికి కొట్టుకుపోయాయి. వరదనీరు పంటపొలానికిచేరి నష్టపోయానని రైతు రాజు ఆవేదన వ్యక్తంచేశారు.

## అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు

**-మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్**



బాధితులతో మాట్లాడుతున్న వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్

**హవేలీఘనపురం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు బిజెపి పార్టీ అండగా ఉంటుందని మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలంలో భారీవర్షాల కారణంగా గాజిరెడ్డిపల్లి, బూర్గుపల్లి, కాపరయిపల్లి, ధూప్‌సింగ్ తండాలలో జరిగినటువంటి పంటనష్టం, ఆస్తినష్టం, ఇళ్లు, బ్రిడ్జిలు కూలిపోవడంతో వాటిని పరిశీలించారు. అదేవిధంగా రాజ్‌పేట్ గ్రామానికిచెందిన సత్యనారాయణ, యాదగౌడ్‌లు వరదలో కొట్టుకపోయి ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారు మాట్లాడుతూ నష్టపోయిన వారికి అండగా ఉంటామని,అధైర్య పడవద్దని వారికి తెలిపారు. ఏ కష్టం వచ్చినా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు అండగా ఉంటారని, ఏ సమస్య ఉన్నా మీకు తోడుగా అండగా ఉంటాడని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌రెడ్డి, జనగాం ప్రభారి నందారెడ్డి, జిల్లా కార్యదర్శి బాలరాజు, కలికి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్ఎల్ఎన్ రెడ్డి, విజయ్ కుమార్,ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, జిల్లా ఎస్టి మోర్చా ప్రధాన కార్యదర్శి రాములునాయక్, అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్, హవేలీ ఘనపూర్ మండల్ బిజెపి అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లానాయకులు లోకేష్, వెంకట్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శులు సంఘసాని రాజు, శ్యామ్, ప్రభు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు సాయిబాబా, కార్యదర్శులు సురేందర్‌గౌడ్, బూత్ అధ్యక్షులు ప్రవీణ్, గంగారం, సాయిరాం, కిష్టయ్య, కుమార్, నరేష్, అనిల్, అనిల్‌నాయక్, మండల నాయకులు భీమ్‌రాజ్, సాయి, రాజు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎస్‌జిఎఫ్ 69వ క్రీడా పోటీలు

**చౌటకూరు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

ఈ నెల 2వ తారీఖున మండల కేంద్రమైన చౌటకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలురకు 69వ ఎస్‌జిఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నటట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ నెల 3న బాలికలకు క్రీడా పోటీలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటలకు రెండు రోజులు క్రీడా పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. మండలంలోని యుపిఎస్, హెచ్ఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పిడిలు విద్యార్థులను తీసుకుని చౌటకూరు జడ్పిహెచ్ఎస్‌కు చేరుకోవాలన్నారు.

# కాళేశ్వరాన్ని నిర్వీర్యం చేయడానికి కాంగ్రెస్ కుట్ర..?

**-కాళేశ్వరాన్ని రాజకీయం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరికాదు**

**-ఎమ్మెల్యే సునీతారెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

కాళేశ్వరాన్ని నిర్వీర్యం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, కాళేశ్వరం ప్రాజెక్టు మహోన్నతమైన కట్టడం అని పేర్కొంటూ అటువంటి ఈకాళేశ్వరాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేయడం సరికాదని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని ఆమె స్వగృహంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేస్తూ అసెంబ్లీలో కాళేశ్వరంపై సమావేశాన్ని ఏర్పాటు చేయడం సరికాదన్నారు. కాళేశ్వరం మహోన్నతమైన కట్టడం అని దీంతో లక్షల ఎకరాలపంటలు పండుతున్నాయి అని అన్నారు. లక్షలకొద్దీ టన్నుల నీరు వృథాగా పోయినప్పుడు కాంగ్రెస్ ఏమి చేసిందని ప్రశ్నించారు. కాళేశ్వరాన్ని నిర్వీర్యం చేయడానికి కాంగ్రెస్ కుట్రపన్నుతుందని అన్నారు. ఎన్‌డిఎస్ఎ ఎంక్వయిరీ చేసినప్పుడు 350 రోట్లు పెడితే బాగయ్యేదని తెలిపారు. కాళేశ్వరం ఎంక్వయిరీ ప్రస్తుతం సిబిఐకి ఇవ్వడం జరిగిందన్నారు. రైతులు ఎరువులకోసం రోడ్డు ఎక్కుతుంటే పంటలు వరదలకు నష్టపోతున్న రైతుల కోసం అసెంబ్లీలో మాట్లాడకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతువ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. ఎక్కడైనా, ఎప్పుడైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జపంచేయకుండామాట్లాడడంలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కుమ్మక్కై టిఆర్ఎస్‌పార్టీకి ఉనికిలేకుండా చేసేప్రయత్నం చేస్తున్నాయని పేర్కొంటూ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌స్థాయిని ఎవరూ తగ్గించలేరని అన్నారు. రైతులవ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణద్రోహిగా మిగిలిపోతాడని అన్నారు.

ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీజడ్పి కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నహీముద్దీన్, సీనియర్ నాయకులు సత్యంగౌడ్, మండల టిఆర్ఎస్ అధ్యక్షులు భోగ శేఖర్, పట్టణ అధ్యక్షుడు పంబల బిక్షపతి, నాయకులు బాల్‌రెడ్డి, రింగుల ప్రసాద్, షేక్ హుస్సేన్, సూనానం నర్సింలు, ఆంజనేయులుగౌడ్, సుధాకర్‌రెడ్డి, విట్టల్, సంతోష్‌రావు, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గండ్లు పడ్డ కాలువలకు మరమ్మతులు చేపట్టాలి

**-దెబ్బతిన్న పంటలకు ఎకరానికి 50వేలు చెల్లించాలి**

**-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్**



నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న 2అతిమేల మాణిక్

**పుల్‌కల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే రైతులు తీవ్రంగా నష్టపోయారని, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ ఆరోపించారు. మండలపరిధిలోని మిన్పూర్‌లో వరదనీటిలో మునిగిపోయిన పంటలను సిపిఎం అందోల్ ఏరియాకమిటీ ఆధ్వర్యంలో పార్టీనాయకులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, అతిమేల మాణిక్, సిపిఎం అందోల్ ఏరియా కార్యదర్శి విద్యాసాగర్, మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీవర్షాలతో సింగూరు డ్యాం నిండిపోవడంతో దిగువకు వరదనీటిని వదలడంతో కాల్వకట్టల సామర్థ్యం దెబ్బతిని ఉండటంతో పలుచోట్ల గండ్లు పడ్డాయని ఆందోళన వ్యక్తంచేశారు. గండ్లుపడి రైతులు సాగుచేసుకుంటున్న పంటలోకి నీరుచేరి పంటలు నీటిపాలయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి 50వేలరూపాయలచొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎడమకాలువ ఆధునీకరణలో కాంట్రాక్టర్ తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నర్సింలు, జిల్లా కమిటీసభ్యులు కృష్ణ, నాయకులు పి.అశోక్, నాగభూషణం, కృష్ణ, ప్రభాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి బిజెపితోనే సాధ్యం



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే బిజెపితోనే సాధ్యపడుతుందని బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట, శాలిపేట, వెంకట్‌రావుపల్లిలో ఎంపినిధులతో ఏర్పాటుచేసిన సోలార్‌లైట్స్‌ను ప్రారంభించారు. అనంతరం మెదక్ ఎంపి రఘునందన్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే చిన్నశంకరంపేట పట్టణంలో అంగన్‌వాడీ బిల్డింగ్‌లకు రూ.10లక్షల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. మండల కేంద్రంలో మినీఫంక్షన్‌హాల్, కమ్యూనిటీహాల్ ఉంటే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈవిషయంపై మెదక్ ఎంపి రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లారెడ్డి, మేడి శ్రీను, ఆకుల రాజు, నిద్రబోయిన స్వామి, యాచం వెంకన్న, మూర్తి శంకర్, శ్రీశైలం కిషోర్, మేడి యాదగిరి, మేడి వెంకట్‌రాములు, చాకలి షేకులు, సిరిగద్దే ప్రకాష్, నిద్రబోయిన కిషన్, గంగులు తదితరులు పాల్గొన్నారు.

## కారముంగిలో మునిగిన సోయాబీన్ పంట

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కారముంగా గ్రామంలో రైతులు సాగు చేసుకుంటున్న సోయాభీన్ పంట ఇటీవల కురిసిన బారీ వర్షాలకు నీటమునిగాయి. గ్రామానికి చెందిన రైతు శాంత కుమార్ మంజీరా పరివాహక ప్రాంతంలో అనేక ఎకరాల్లో సోయాబీన్ పంటను సాగుచేసుకుంటుండగా పంట నీట మునిగిపోయింది. పంట నష్టపోయినందున ప్రభుత్వం ఆదుకోవాలని రైతు శాంతకుమార్ ప్రభుత్వానికి వినతి చేశారు.

## మంజీరాలో చిక్కుకున్న పశువులకు విముక్తి

**-ఆనందంలో అన్నదాతలు**



ఎద్దులు, ఆవులు, దూడలను రక్షించి రైతులకు అందచేస్తున్న తహసీల్దార్

**మనూర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మంజీరానదిలో మండల పరిధిలోని ఎన్‌జి హుక్రానా గ్రామానికి చెందిన శేఖర్‌కు చెందిన పశువుల (ఎద్దులు, ఆవులు, దూడలు)ను తహసీల్దార్ విష్ణుసాగర్ పోలీసు, రెస్క్యూటీంసభ్యుల సహకారంతో రక్షించి రైతులకు సోమవారం అందచేశారు. మంజీరాలో చిక్కుకున్న తమపశువులు తమకు అందుతాయో లేదో అన్నభయంతో ఉన్న అన్నదాతలకు తహసీల్దార్ ప్రత్యేకచొరవ తీసుకుని పశువులను నీటిబారి నుంచి కాపాడి తమకు అప్పగించడం ఆనందంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఖాజా మైనుద్దీన్ తదితరులు ఉన్నారు.

## యూరియా కష్టాలు తీరేదెప్పుడు...

**-ఎన్నడూ లేనివిధంగా రైతన్నకు యూరియా కష్టాలు..**

**-ఉదయం నుంచే యూరియా కోసం పడిగాపులు**



సహకార సంఘం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

రైతన్నను రోజురోజుకు యూరియాకష్టాలు వెంటాడుతున్నాయి. పొద్దస్తమానం పడిగాపులుపడినా కావలసినన్ని యూరియా బస్తాలు దొరకడంలేదు. తిండితిప్పలు మానేసి యూరియాకోసం పడిగాపులుకాస్తున్నారు. చిన్నశంకరంపేట పట్టణంలోని ఆగ్రో రైతు సేవాకేంద్రం, మదూర్‌లోని సహకార సంఘాల వద్దకు యూరియా వచ్చిందని తెలియగానే పెద్ద ఎత్తున రైతులు అక్కడికి తరలివెళ్లి చెప్పులను క్యూలైన్లో పెడుతున్నారు. పోలీసులు కల్పించుకొని వారిని సముదాయించి వరుసలో నిల్చొబెడుతున్నారు. మదూర్ వద్ద గజగట్లపల్లికి చెందిన రైతు సిద్దిరాములు ఉదయం నుండి వరుసలో నిలబడి స్పృహకోల్పోయాడు. ఒక్కబస్తాయూరియాకోసం 7గంటలపాటు లైన్‌లో నిల్చున్నానని తెలిపారు.

**యూరియా పంపిణీ పరిశీలించిన తహసీల్దార్...**

రైతులు, మహిళలు బారులు తీరిన విషయం తెలుసుకున్న తహసీల్దార్ మాలతి రైతు సేవాకేంద్రాన్ని పరిశీలించారు. యూరియా కొరత గురించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. లారీల వద్దకు వెళ్లి యూరియా పంపిణీ పరిశీలించారు. త్వరలో యూరియా కొరత తీరుతుందని తెలిపారు. ఆమెవెంట వ్యవసాయశాఖ అధికారి లక్ష్మీప్రవీణ్ ఉన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**-ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య**



జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

ప్రభుత్వ ఉద్యోగుల పాలిట శాపంగా సెప్టెంబర్ 1 మారిందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య అన్నారు. సిపిఎస్ అమలుకు నిరసనగా సోమవారం చిన్నశంకరంపేటలోని జడ్పి ఉన్నతపాఠశాల విరామసమయంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి పోచయ్య ఆధ్వర్యంలో నిరసన తెలియచేశారు. అనంతరం వారు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగులందరికి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. సిపిఎస్ 01-09-2024 నుండి అమలులోకి వచ్చిందని, అప్పటినుండి ఇప్పటివరకు సిపిఎస్‌లో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులు ఉద్యోగవిరమణ పొందితే వారికి వచ్చే పెన్షన్ 2000 రుపాయల వరకు మాత్రమే ఉంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. సిపిఎస్ రద్దు అయ్యేవరకు ఎస్టీయుటిఎస్ దశలవారీగా పోరాటం చేస్తుందనితెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా మండల నాయకులు, ఉపాధ్యాయులు ఎం.రతన్, నాగరాజు, కిషన్, బాలరాజు, ప్రభాకర్, వసుంధర దేవి, సరిత, సునీత, మంజుల, జలజ, సి. మంజుల, దయాన తదితరులు పాల్గొన్నారు.

## 50శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

**సిర్గాపూర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

రైతులకు 50శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.హరికృష్ణ తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, మహిళారైతులకు 50శాతం, ఇతర రైతులకు 40 శాతం రాయితీపై వ్యవసాయ పరికాలను అందచేయనున్నామన్నారు. రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు/పంపులు, రోటవేటర్లు, సీడ్‌కమ్ ఫర్టిలైజర్ డ్రిల్లులు, డిస్క్ హ్యారో/కల్టివేటర్/ఎంబిప్లోవ్/ఏజీ వీల్, పవర్ వీడర్లు, బ్రష్ కటర్లు, పవర్ టిల్లర్లు, మొక్క జొన్న షెల్లెర్లు, స్ట్రా బేలర్‌లు అందుబాటులో ఉన్నాయని. రైతులు దరఖాస్తు పత్రంతో పాటు ఆధార్‌కార్డు, పట్టాపాస్ పుస్తకం, ట్రాక్టర్ సంబంధించిన పరికరాలకు ఆర్‌సి జిరాక్సు, బ్యాంక్ పాస్ పుస్తకం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, సాయిల్ హెత్ కార్డ్ (భూసార పరీక్ష పత్రం)లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు రైతువేదికలో క్లస్టర్ ఏఈఓకు, లేదా మండల వ్యవసాయ అధికారికి దరఖాస్తులను అందచేయాలని మండల రైతులకు సూచించారు.

## రాగం దేవేందర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

తెల్లాపూర్ మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు రాగం దేవేందర్ యాదవ్‌ను పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. దేవేందర్ యాదవ్ తండ్రి రాగం కొమరయ్య యాదవ్ అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే దేవేందర్ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ ఎంపిపి అధ్యక్షులు యాదగిరి యాద్ మాజీ ఎంపిటిసి సభ్యులు నరసింహ, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివంపేటలో రైతులకు యూరియా పంపిణీ



రైతులకు యూరియా అందచేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షులు నత్తి దశరథ్

**చౌటకూరు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని శివంపేటలోని కో-ఆపరేటివ్ సొసైటీలో ఆయా గ్రామాల రైతులకు సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ యూరియాను పంపిణీ చేశారు. రైతులకు సరిపడ యూరియాను అందచేస్తామని నత్తి దశరథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రవీన్, మండల నాయకులు ఈశ్వర్‌గౌడ్, నత్తి రాములు, శివంపేట అధ్యక్షులు మల్లికార్జున్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు

**మనూర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని రాయిపల్లిలో 40వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. దర్గాకు గంధాల ఊరేగింపు, కవాలి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయాప్రాంతాలనుంచి ఆశ్రమ పీఠాధిపతులు పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్గాను దర్శించుకున్నారు.

## హానర్ ల్యాబ్ సహాయం అందివ్వాలి

**-కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి**



కంపెనీ ప్రతినిధికు వినతిపత్రం అందిస్తున్న నాయకుల దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండలం మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో హానర్ ల్యాబ్ ప్రతినిధి బివిరెడ్డిని కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మద్ది ప్రతాపరెడ్డి మాట్లాడుతూ అన్నారం పరిధిలో నుండి జంగంపేట వరకు రోడ్డు మరమ్మతు, అన్నారం లోని ఆయా వార్డులలో కనీస అవసరాల అభివృద్ధి కోసం గ్రామాల్లోని మాజీ నాయకులు కలిసి కంపెనీ ప్రతినిధిని సోమవారం సంప్రతించడం జరిగిందని దానికి హానర్ ల్యాబ్ ప్రతినిధి బివిరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తమపై అధికారులకు ఈవిన్నపాన్ని తెలియజేసి త్వరలోనే కావాల్సిన నిధులను కేటాయిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరభద్రస్వామి ఆలయకమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి, నాయకులు మాజీ ఉపసర్పంచ్ మురళి, జయశంకర్‌గౌడ్, నరసింహారెడ్డి, సాయిచందు, బిక్షపతి, శేఖర్, మాజీ వార్డ్‌మెంబర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

**చౌటకూరు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ శంకర్ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయాశాఖల అధికారులు పాల్గొని ప్రజలు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపిడిఓ శంకర్, ప్రధాన ఉపాధ్యాయులు అనురాధ, విద్యుత్ ఎఈ సాయిరాఘవ, వ్యవసాయ అధికారి ప్రవీన్ తదితరులు పాల్గొని ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వినాయక మండపాల వద్ద అన్నదానం

**అల్లాదుర్గం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన అల్లాదుర్గంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద సోమవారం అన్నదానవితరణ కార్యక్రమం నిర్వహించారు. గణపతి మండపంలో అర్చకులు కాశీనాథ్ వేద మంత్రాలు వల్లిస్తుండగా భక్తులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండపానికి చేరుకున్న భక్తులకు అన్నదాన వితరణ చేశారు. సోమవారం అల్లాదుర్గంలో వారంతపు సంత కావడంతో ఆయా గ్రామాల నుంచి సంతకు వచ్చిన భక్తులు వినాయక మండపానికి చేరుకుని వినాయకుడిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేష్, నవీన్‌కుమార్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై. సదానందం, రైతుసంఘం అధ్యక్షులు రమేష్ తదితరులు గజాననుడిని దర్శించుకున్నారు.